# నేహాల



సాయి బ్రహ్మానందం గొర్తి

## చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

# 7

**చవితి చంద్రుడు** సన్నని గీతలా ఆకాశంలో మెరుస్తున్నాడు. పూర్తి చీకటి పడకుండానే చలిగాలులు వణికిస్తున్నాయి. నాడు సాయంత్రం అశ్వత్థనారాయణ స్వామి గుడికి రమ్మనమని రేవన్నకి కబురంపింది నేహల. వేదరాయశర్మ గురుకులం వద్ద కలిసే వారు. ఆయన విజయనగరం వెళ్ళడంతో అందరూ విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎప్పుడైనా వేదరాయ శర్మ భార్యని పలకరించడానికి వెళ్ళేది. రేవన్న గత రెండు నాళ్ళగా పత్తా లేడు. తండ్రికి పొలం పనుల సాయంలో క్షణం తీరికలేకుండా ఉంది నేహల. పంట పండి ధాన్యాలు ఇంటికి తెచ్చారు. అదంతా శుభ్ర పరిచి గాదెలో పెట్టడమూ, పనివాళ్ళని పర్యవేక్షించడమూ వీటితో క్షణం తీరిక లేకపోయింది. ఎప్పుడైనా రేవన్నే నేహల ఇంటికి వచ్చేవాడు. మధ్యాహ్నం ప్రభ వస్తే రేవన్న ఎందుకు రాలేదోనని కబురంపింది నేహల. రేవన్న ఇల్లు ఊరి చివరుంటుంది. నడిచి వెళ్ళే దూరం కాదని నేహలకి తెలుసు. పైగా తనొక్కతీ ఊరు చివరకెళితే తండ్రి కంగారుపడతాడు. అందుకే గుడికి రమ్మనమని కబురంపింది.

దేవుణ్ణి దర్శించుకున్నాకా గుడి వెనుకనున్న కోనేరు మెట్ల మీద కూర్చుంది నేహల. రేవన్న వచ్చిన జాడ లేదు. గుళ్ళో పూజ మంత్రాలు గట్టిగా వినబడుతున్నాయి. కొంతసేపటికి ఎవరో వస్తున్న అలికిడి వస్తే అటుగా చూసింది నేహల. రేవన్న వచ్చాడు. అతని వెనుక ఎవరైనా ఉన్నారాని అటూ ఇటూ చూసింది నేహల. ఎవరూ లేరని గ్రహించాక ఒక్క ఉదుటన వెళ్ళి అతన్ని చుట్టుకుపోయింది. రేవన్నా భయంగా అటూ ఇటూ చూసాడు. ఎవరూ చూడడం లేదని ధీమా కలిగాక మరింత గట్టిగా దగ్గరకి తీసుకున్నాడు. కొన్ని క్షణాలయ్యాక నేహలే రేవన్న ఎందుకు రాలేదని అడిగింది.

"ఏదో మాట వరసకి మా అమ్మకి సుస్తీ చేసిందని అబద్ధం చెబితే అది కాస్తా నిజమయ్యింది. గత రెండునాళ్ళగా అమ్మకి వంట్లో వేడి చేసింది. అందువల్ల కాస్త పని పెరిగింది. నాన్న కూడా లేరు. రాయచూరు పనిమీద వెళ్ళారు. అమ్మనొక్కత్తినే వదిలి రావడం ఇష్టం లేక రాలేదంతే!"

"అంతేనా? నా మీద అలకొచ్చిందేమోనని అనుకున్నాను."

"నేనేమన్నా నేహలనా? అలక రావడానికి."

అతని మాటలు విని ఒక్క గుద్దు గుద్దింది నేహల. గట్టిగా నవ్వాడతను.

"గురువుగారు ఎపుడొస్తారు? ఇంకా మూడు వారాలు పడుతుందా?" ప్రశ్నించింది నేహల.

"తెలీదు. వెళ్ళేముందు అలాగనే చెప్పారు. కానీ వెళ్ళింది విజయనగరానికి. రాచకార్యాలు కొత్తవి పుట్టుకు రావచ్చు. క్రితం సారి దసరాకి వెళ్ళినప్పుడంతే! మేం అనుకున్న దానికంటే ఎక్కువగా మూడు వారాలుండిపోవల్సి వచ్చింది."

"చెప్పడం మరిచిపోయాను. ప్రభా వాళ్ళూ రేపు నెగొంది వెళుతున్నారట. వాళ్ళ మావయ్య కూతురు చనిపోతే పరామర్శించడానికి కుటుంబం మొత్తం కలిసి వెళుతున్నారట. నీకో విషయం తెలుసా? ప్రభావాళ్ళ మావయ్య కూతుర్ని రాజవంశీయుల్లో ఒకతనికిచ్చి ఏడాది క్రిందట పెళ్ళి చేసారు. ప్రభా వాళ్ళ మావయ్యకి ఈ పెళ్ళి ఇష్టం లేదట. కానీ వాళ్ళత్తయ్య పోరుపడలేక సరేనన్నాడట.ఇవాళ మా

ఇంటికొచ్చినపుడు చెప్పింది. చివరికి ఎలాగో ఒప్పుకుంటే క్రితం ఏడాది పెళ్ళి చేసారు. పెళ్ళయి రాజ మందిరానికి వెళ్ళాక ఆ అమ్మాయిని తన వాళ్ళని కలవనీయకుండా నిర్బంధించారట. గట్టిగా అడిగితే రాచ మర్యాదలూ, రాణీ వాస నియమాలూ అంటూ అడ్డుకున్నారట. పెళ్ళయిన ఎనిమిది నెలల వరకూ మె తల్లి తండ్రుల్నే కలవలేదట. ఈ లోగా మెకి గర్భస్రావం అయ్యి, అనారోగ్యం అయ్యిందట. అప్పుడు కూడా తల్లి తండ్రుల్ని చూడ్డానికి రానీయలేదు. ఈలోగా ఆ రాజ వంశీయుడికి ఆమెపై మోజు పోయి వేరే - ఆమెను తెచ్చుకున్నాడట. ఇది చూసి భరించలేక ఆమె రాజమందిరం పై నుండి దూకి ఆత్మహత్య చేసుకుంది. పెళ్ళయి వెళ్ళిన ఆమె శవంగా ఇంటికి చేరింది. ప్రభ ఈ కథ చెబుతూంటే ఒక్కసారి ఒళ్ళు జలదరించింది. పాపం అమ్మాయి ఎంత వేదననుభవించిందో కదా? పెళ్ళి చేసుకొని రాజమందిరానిక్కాదు, నరక కూపానికి వెళ్ళింది. ఇదంతా తలచుకుంటూ నిన్న రాత్రి సరిగా నిద్రే పట్ట లేదు.."

"అయ్యో పాపం. ఆ అమ్మాయి చచ్చి పోయిందా?"

"చావక ఏం చేస్తుంది? అనుక్షణమూ మరణించేకంటే ఇదే మేలనుకుని ఉంటుంది." చెబుతూ నేహల కంఠం గద్గదికమయ్యింది.

"ఇంతకీ ఈ పెళ్ళి ఆ అమ్మాయి ఇష్టప్రకారమే జరిగిందా?"

"ఆ అమ్మాయి ఇష్టపడే చేసుకుంది. పిల్ల తండ్రి వద్దన్నా, తల్లీ కూతురూ ఖాతరు చెయ్య లేదు."

"ఆ అమ్మాయే ఇష్టపడి వెళితే మరెందుకిలా జరిగింది?"

"ఎందుకేవిటి? రాజవంశీయుడి దృష్టిలో ఆడదంటే భోగ వస్తువు. అధికారం అడ్డు పెట్టుకొని ఆమెను మోహించుంటాడు. కోరిక తీరాక మరో అమ్మాయిని పట్టుకున్నాడు. ఏముందీ? ఏ రాచ చరిత్ర చూసినా ఇవే గాథలూ, ఇవే బాధలూ! ఎందుకో తెలీదు మామూలు ప్రజలకి రాజ కుటుంబీకులంటే అంత మోజు. ఏదో పరివారమూ, నగలూ వుంటాయన్న ఆశ అయ్యుండచ్చు. నా వరకూ ఇలాంటివి నచ్చవు. రాణివాసం ఒక గాజు మందిరం. బయట చూడ్డానికి అందంగానే ఉంటుంది. లోపలే ఊపిరి సలపని జీవితాలు. మనిషై పుట్టాకా ఆనందంగా, సంతోషంగా జీవించని బ్రతుకులు వృధా. ఆభరణాలూ, అలంకారాలూ ఆనందాన్నివ్వవు. సౌకర్యాలూ, సదుపాయాలు కాదు కావల్సింది మనిషికి. కాసింత ప్రేమా, ఆప్యాయతా. అవన్నీ అక్కడుంటాయని నేనుకోను. ఆదరణ కరువైన చోట అలంకారాలు తృప్తినివ్వవు రేవన్నా! "

"అలాగే చెబుతావు ఇప్పుడు. రేపు ఏ రాజకుమారుడో నిన్ను చేసుకుంటానని వస్తే..." అతని మాటలు పూర్తికాకుండా చేతిని అతని నోటికడ్డంగా పెట్టింది. మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి ఆమెకి.

"వద్దు రేవన్నా! పొరపాటున కూడా అలా అనద్దు. నాకలాంటి కోరికా లేదు. ఆశ అంతకన్నా లేదు. నీకు చాలా సార్లు చెప్పాను. అమ్మా,నాన్నా, నువ్వూ..ఇదే నా ప్రపంచం. ఇంతకు మించి నాకింకేమీ వద్దు."

నేహల అభిప్రాయాలూ, ఆలోచనలూ చూసి ఆశ్చర్యపోయాడు రేవన్న. చిన్న వయసయినా ఎంతో పరిణితి చెందిన వ్యక్తిగా ప్రవర్తిస్తుంది. నేహల లాంటి స్త్రీలు అరుదుగా ఉంటారు.

ఆమె చెక్కిలిపై కన్నీటి చుక్కలు రావడం గమనించాడు రేవన్న. చెక్కిలిపై మెరుస్తున్న కన్నీటి బొట్లని తుడుస్తూ -

"నేహలా! ఏదో సరదాకన్నాను. దానికే ఈ కన్నీళ్ళా? ఇంతకీ మీ నాన్నకి మన విషయం చెప్పేవా?" అనడిగాడు.

లేదన్నట్లు తలూపింది.

"ఎప్పుడు చెబుతావు?'

"సమయం చూసి చెబుతాను. అయినా మా నాన్న నా మాట కాదనడు. మా అమ్మ కూడా అంతే, అభ్యంతరం చెప్పదు. ఏదైనా వుంటే మీ ఇంట్లోనే ఉండాలి. మీరు బ్రాహ్మలు కదా? పట్టింపులుంటే మీకే ఉండాలి."

"మా అమ్మా, నాన్నా కూడా అంతే. నా మాట కాదనరు. ఒకవేళ కాదన్నా, నేను వాళ్ళని ఒప్పిస్తాను. లేదంటే ఎదిరించయినా చేసుకుంటాను. అంత అవసరం రాదనే అనుకుంటున్నాను. నీ గురించి మా అమ్మకి చూచాయగా చెప్పాను."

"మీ అమ్మగారికి చెప్పావా?" ఆశ్చర్యపోతూ అడిగింది. అవునన్నట్లు తలాడించాడు.

"మరేమన్నారు మీ అమ్మగారు..."

"మా అమ్మకి నువ్వంటే ఇష్టమే నేహలా! మీరే కులం అన్నది అంత పట్టింపు మాకు లేదు. ఎందుకంటే మా అమ్మది బ్రాహ్మణ కులం. మా నాన్న వాళ్ళూ వైశ్యులు.. అయినా ఇద్దరూ పెళ్ళి చేసుకోలేదా? నా వరకూ ఎలాంటి సమస్యా రాదు. నువ్వే మీ ఇంట్లో ముందు చెప్పాలి."

"అతి త్వరలోనే మా నాన్నకి చెప్తాను రేవన్నా! కాస్త ఓపిక పట్టు. ఈ పంటలూ, కోతలూ హడావిడి తగ్గాక మా నాన్నకి చెబుతాను.. నువ్విచ్చిన తాయత్తు చూసి మా నాన్న ఎక్కడదని అడిగాడు. నువ్వు విజయనగరం నుండి తెచ్చావని చెప్పడానికి కాస్త జంకాను. ప్రభా, నువ్వూ అందరూ విజయనగరం వెళ్ళినపుడు తెచ్చానని మాత్రమే చెప్పాను. అప్పుడే చెప్పుండాల్సింది నేను. సమయం చూసుకొని చెప్తాను."

తన చేతికున్న తాయత్తుకేసి చూస్తూ అంది.

రేవన్న నేహల చేతున్న తాయత్తుపై చెయ్యి వేసాడు. నేహల ముందుంటే రేవన్నకి కాలం తెలీదు. రేవన్న సమక్షంలో నేహలకి ప్రపంచం పట్టదు.

స్వచ్ఛమైన ప్రేమకి తార్కాణమయిన ఆ ఇద్దర్నీ చూడడానికి అడ్డొచ్చిన చెట్టుకొమ్మల్ని పక్కకు తోసాడు చవితి చంద్రుడు. తన -ఆకారాన్ని పెద్దది చేసుకొని చెట్టు చాటునుండి చూస్తూ పరవశించి పోయాడు. వారిద్దరి మధ్యా వేడికి తాళలేక శీతాకాలపు చలి రివ్వున ఎగిరిపోయింది.

కొంతసేపు ముచ్చట్లు చెప్పుకున్నాక ఇద్దరూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళిపోయారు.

00000000000

చీకటి పడ్డాక శంభుడూ, వేదరాయశర్మా తమ విడిదికి వచ్చేసారు. వచ్చేటప్పుడు ఆస్థాన చిత్రకారులనుండి తను వేయబోయే చిత్రానికి కావల్సిన రంగులూ, కుంచెలూ తెచ్చుకున్నాడు. నేహల చిత్ర పటం వెయ్యడానికి నాలుగైదు రోజులు పట్టచ్చు. వేసిన రంగులు ఆరడానికి సమయం కావాలి. అందువల్ల తమ బసకి చేరుకోగానే పనిలో నిమగ్నమయ్యాడు. మహారాజుకి నచ్చేలా, ఆయన మెచ్చేలా ఈ చిత్రం గీయాలి. తన అదృష్టం బావుంటే తనకి రాజాస్థానంలో ఉద్యోగం దొరకచ్చు. పని మాటెలా వున్నా కానుకలయినా వస్తాయి. తనకిదొక సువర్ణావకాశం. దీన్ని వదులుకో కూడదు. భోజనాలయ్యాక వేదరాయశర్మ బడలికతో నిద్రకుపక్రమించాడు. తమ బసలోనే వేరే గదిలో ఉన్నవాళ్ళూ నిద్రపోడానికి సంసిద్ధులవుతున్నారు. వారుండే ఇంటికి మధ్య మండువా లోగిలో బొమ్మగీయడానికి కావల్సిన పరికరాలన్నీ అమర్చుకున్నాడు. విడిది సంరక్షకుణ్ణి ఒక తైల దీపం అమర్చమని ముందుగానే అడిగాడు. మహారాజు పేరు చెప్పగానే అతను క్షణంలో అమర్చాడు.

మరీ పొద్దు పోయేవరకూ మెలకువగా ఉండొద్దని వేదరాయశర్మ చెప్పాడు. బొమ్మ వేయడానికి నల్ల కణికని తీసుకొని ఎలా వేద్దామని ఆలోచిస్తున్నాడు. ఒక్క సారి నేహల రూపాన్ని గుర్తు తెచ్చుకున్నాడు.

విశాలమయిన మీన నేత్రాలు, సంపెంగ రేకులాంటి ముక్కూ, దానికిందే ఎర్రటి పెదాలకి పైన ఆవగింజంత పుట్టు మచ్చా, పాలరాతిలా తళ తళలాడే శరీర ఛాయా,వంకీలు తిరిగే పొడవాటి నల్లటి కురులూ, శంఖంలాంటి మెడా, నాజూకైన నడుమూ -శరీరంలో అన్ని భాగాలూ ఎంతెంత ఉండాలో అంతేసి కూర్చి బ్రహ్మ చేసిన అపురూప సౌందర్యవతి నేహల. ఒక్క సారి చూస్తే

తలతిప్పకుండా చూసే అందం. ఒకటికి పదిసార్లు చూడాలనుకునే సౌందర్యం. చిన్నపటినుండీ తెలిసినా యుక్త వయసొచ్చాకా నేహల రూపం ముగ్ధ మనోహరంగా తయారయ్యిందని శంభుడికి తెలుసు.. అమెను చూసిన ప్రతీ మగాడూ వివాహం చేసుకుంటే బావుంటుంది కదా అనుకుంటారు. అంతెందుకూ? తనూ అలాగే చాలాసార్లు ఊహించుకున్నాడు. నేహల అందం అటువంటిది. శంభుడి రంగు తక్కువ. ఓ మోస్తరు రూపం ఉన్న తనని పెళ్ళి చేసుకోడానికి నేహల ఒప్పుకోదని ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. ఈ లోగా నేహలా, రేవన్నల కలివిడితనం చూసి అనుమానం వచ్చింది. రేవన్న పై అసూయ కలిగింది. రేవన్న మరీ అంత అందగాడు కాకపోయినా ఆకర్షించుకునే ముఖవర్చస్సుంది. మంచి శరీర సౌష్టవంతో ఆకర్షణీయంగానే ఉంటాడు.

ఎన్నోసార్లు నేహలని పెళ్ళి చేసుకుంటే బావుండేదనుకునే వాడు. తనకొచ్చిన చిత్రకళ ద్వారా నేహల్ని ఆకర్షించడానికి చాలా ప్రయత్నాలే చేసాడు. ఓ సారి నేహల బొమ్మేసి ఆమెకి చూపించాడు. అందరికీ చూపించావా అని అడిగింది. లేదన్నాక బొమ్మ బావుందని చెప్పి తనకి కావాలని అడిగింది. ఎంతో ఆనందంగా ఇచ్చాడు. వెళిపోతూ తన మనసుని ముక్కలుగా చించేసి వెళిపోయింది. ఆ బొమ్మని ముక్కలు ముక్కలుగా చింపేసిన సంఘటనింకా గుర్తుంది. ఆ సంఘటనే కాదు, వెళుతూ నేహల అన్న మాటలు ఒక్కొక్కటీ పొల్లు పోకుండా శంభుడికి గుర్తే!

"శంభూ, మనిద్దరం చిన్న తనం నుండీ కలసి పెరిగాం. నాకున్న మంచి స్నేహితుల్లో నువ్వూ ఒకడవనే ఇన్నాళ్ళూ అనుకున్నాను. కానీ నీ వుద్దేశ్యం వేరని ఇప్పుడర్థమయ్యింది. నువ్వేసిన ఈ బొమ్మలో నా సౌందర్యం కంటే, నీ కోరికే పెద్దదిగా కనబడుతోంది. నన్నొక భోగ వస్తువుగా చిత్రీకరించావు. నా శరీరావయాలన్నీ ఎంతో పరీక్షగా చూస్తే కానీ, నువ్విలా బొమ్మ గీయలేవు. నన్నొక భోగ వస్తువుగా చిత్రీకరించడం నేను భరించలేను. ఇది ఎవరి కంటా పడ లేదు కాబట్టి బ్రతికిపోయాను. ఈ చిత్రాన్నెవరైనా చూసింతరువాత నన్ను చూస్తే వాళ్ళకి నేహల గుర్తుకు రాదు. నువ్వు చిత్రీకరించిన అవయవాలు గుర్తుకొస్తాయి. అది నేను భరించలేను. ఇలాంటి పనులెప్పుడూ చెయ్యకు. ఈ విషయం ఇక్కడితో ఆపేద్దాం. ఇంకెప్పుడూ నా బొమ్మ గీయడానికి ప్రయత్నించకు. ఒకవేళ నాకు తెలియకుండా చేస్తే నేనూరుకోను. జాగ్రత్త!" అంటూ ఎంతో శ్రమపడి గీసిన చిత్ర పటాన్ని తన కళ్ళెదుటే చింపి పారేసింది.

ఈ మాటలన్నీ గుర్తొచ్చి ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు శంభుడు. ఆ సంఘటన జరిగాకా నేహల ఎదుట పడడానికే తను సాహసించలేదు. ఆమెతో మాట్లాడడానికే భయం వేసింది. ఎదురుపడినప్పుడు ఏమీ జరగనట్లుగానే మాట్లాడింది. తరువాత మెల్లగా తనూ మర్చిపోయాడు. అప్పటినుండీ నేహల్ని దూరంగానే ఉంచాడు. ఆమెను చూసినప్పుడల్లా ఏదో తెలీని భయం శంభుడికి. ఆమె మాత్రం ఎప్పటిలాగే ఉంది.

ఇప్పుడు తను చిత్రపటం గీసి మహారాజుకిచ్చానని తెలిస్తే చంపేస్తుంది. గురువుగారు వెయ్యమన్నారని చెప్పి తప్పించుకోవచ్చు. అయినా బొమ్మ గీసింది తనే కాబట్టి తనపై దండెత్తకుండా ఉండదు. అయినా మహారాజు గీయమంటే ఆయన ఆజ్ఞని తిరస్కరించలేక గీసానని చెప్పేయచ్చు. అంతగా కావాలంటే గురువు గారి సహాయం తీసుకుంటే సరి. ఎందుకో బొమ్మ వేయడానికి ముందు కొంచెం భయమేసింది.

గురువుగారితో తన సంశయం చెబుదామనుకుంటూ ఆయన పడుక్కున్న గది వైపు చూసాడు. గురువుగారి గురక స్పష్టంగా వినిపిస్తోంది. అప్పటికే ఆయనకి నిద్ర పట్టేసిందాలా వుందనుకున్నాడు శంభుడు. కొంత సేపు తనలో తను తర్జనభర్జన చేసుకున్నాక, రాజాజ్ఞ సాకు చూపించవచ్చనుకొని బొమ్మ గీయడానికే సిద్ధ పడ్డాడు. చిత్ర పటం గీసాక మహారాజుకి నచ్చితే నేహలని ఆస్థాన నర్తకిగా పిలుస్తారు. ఆమె నాట్యాన్ని చూసి అందరూ మెచ్చుకుంటారు. ఆమెను ప్రత్యక్షంగా చూస్తే రాజు పెళ్ళి చేసుకోవాలనుకోవచ్చు. రాజుని కాదని నేహల అనలేదు. ఆయన ఆజ్ఞను ధిక్కరించలేదు. ఈ విధంగా నయినా రేవన్నా, నేహలా దూరమవుతారు. తనకి కావల్సిందీ అదే

తనెంతో ప్రేమతో గీసిన చిత్ర పటాన్ని ముక్కలు చేసిన సంఘటన మరోసారి గుర్తొచ్చింది. "తనెంతో అందగత్తెన్న పొగరు. గర్వం. అందుకే తనని ఈసడించుకుంది. ఈ బొమ్మ గీసి నేహల్ని పదిమంది మధ్యా నుంచోబెడతాను. ఆమె ఏ చిత్ర పటం చించిందో సరిగ్గా అలాగే వేస్తాను. ఆమె తనని తృణీకరించినందుకు ఇదొక ప్రతీకార చర్య." తనలో తనే అనుకున్నాడు.

ఆవేశానికి  ఆజ్యం తోడై అతనిలో ప్రతీకారం ఉవ్వెత్తున లేచింది. అది దావాలనంలా మారుతుందని అతనూహించలేదు. ఆవేశానికి ఆలోచనుండదు;అదుంటే ఆవేశం ఎలా అవుతుంది? దుఃఖమూ, ఆవేశమూ అనర్థ హేతువని అతనికనిపించలేదా సమయంలో! లోలోపల చిన్నగా మిగిలిన ప్రతీకారం అతనిలో మరోసారి బుస కొట్టింది. నేహల అందాన్ని ఊహించుకుంటూ అతను బొమ్మ గీయడానికి సిద్ధమయ్యాడు.

చిమ్మ చీకటిలో, మినుకు మినుకు మంటూన్న దీపం వెలుతురులో అతనొక చిచ్చుని రాజేస్తున్నాడని ఊహించలేదు. ఆవేశాన్నీ, అగ్నినీ నియంత్రించకపోతే జరిగేవి మహాప్రళయాలే! ఈ చిన్న విషయం గ్రహించే వయసు కాదు శంభుడిది.

000000000

నేహల చిత్రంపటం గీయడానికి మూడు దినాలు పైగానే పట్టింది శంభుడికి. రంగులు ఆరడానికి కొంత సమయం పట్టింది. చిత్రం పూర్తవ్వగానే వేదరాయ శర్మకి చూపించాడు. ఎంతో రమణీయంగా నేహల సౌందర్యాన్ని చిత్రీకరించిన విధానాన్ని చూసి ముగ్ధుడయ్యాడు.  చిత్రాన్ని చూస్తే నేహలని చూసినట్లుగానే ఉంది. శంభుడి చిత్రకళా నైపుణ్యాన్ని చూసి మెచ్చుకోకుండా ఉండలేక పోయాడు.

"ఈ చిత్రం చూస్తే అచ్చం నేహలేనా అన్నట్లుగా గీసావు. దేవరాయుల వారికి చూపిస్తే ఎంతో సంతోషిస్తారు. నీ పనితనంతో నా గౌరవాన్ని పెంచినట్లుగా వుంది. నిన్ను చూసి చాలా గర్వపడుతున్నాను శంభా!"

గురువుగారి మన్ననలు శంభుడికి ఎంతో ధైర్యాన్నిచ్చాయి. నేహల తను చేసినపనికి గొడవ పెడితే గురువుగారి మద్దత్తు తనకుంటుందన్న నమ్మకం కలిగింది. కానీ అది ఆయన నోటే వస్తే మరీ మంచిదనుకున్నాడు.

"గురువుగారూ, మహారాజుకి నచ్చినా నచ్చకపోయినా మీకు నచ్చడమే నాకు ముఖ్యం. నాదొక చిన్న కోరిక. నేను చిత్రపటం వేసినట్లుగా నేహలకి చెప్పకండి. ఈ విషయం తెలిస్తే నన్ను క్షమించదు. అసలే ఆమెకి కోపం ఎక్కువ..." నసుగుతూ భయంగా అన్నాడు.

"నీకు ఆ భయమవసరం లేదు. నేనే వెయ్యమన్నానని చెబుతానులే! అయినా నేహల పిచ్చి మొద్దు. ప్రపంచం తెలీదు. ఆమె నాట్యం చూస్తే మహారాజులు ఖచ్చితంగా మెచ్చుకుంటారు. తద్వారా ఆమెకి ఎంతో పేరు ప్రతిష్టలొస్తాయి. అందుకే నువ్వు ఆమె చిత్రం గీస్తానన్నా నేను అభ్యంతర పెట్ట లేదు. రాజాహ్వానం పొందడం అంత సులభం కాదు." శంభుడి భుజం తడుతూ చెప్పాడు.

ఆ చిత్రపటాన్ని ఒక ప్రత్యేకమైన గుడ్డలో చుట్టి రాజాస్తానానికి బయల్దేరారిద్దరూ. ఈ చిత్రం పనిలో ఉండడం వలన శంభుణ్ణి వదిలి ఇంతకు ముందు వేదరాయశర్మొక్కడే రాజమందిరానికి వెళ్ళేవాడు. ప్రతీ సారీ వెళ్ళే రాజమందిరానికి వెళ్ళలేదీసారి. దేవరాయుల కళామంటపానికి వెళ్ళారు. ప్రతి దినమూ సంగీత సాహిత్యాల కళారాధన అక్కడే జరుగుతుంది. దేవరాయలు వారానికి రెండు మూడుసార్లయినా కళా మంటపాన్ని సందర్శిస్తాడు.

ఆ మంటపం చేరే సరికి దేవరాయులు అక్కడే ఉన్నాడు. వేదరాయ శర్మనీ, శంభుణ్ణి లోపలికి ఆహ్వానించాడు. వెళుతూనే వేదరాయశర్మ తన శిష్యుడు వేసిన చిత్రం పటం గురించి చెప్పాడు.

దేవరాయులు ఎంతో ఉత్సుకత ప్రదర్శిస్తూ  చిత్ర పటాన్ని చూపించమన్నాడు.

చిత్రపటాన్ని విప్పి చూపించాడు శంభుడు. చిత్రం పటం కేసి ఒక్క క్షణం తేరపార చూస్తూ ఉండిపోయాడు దేవరాయలు. ఎవరీ సౌందర్యవతి? తన జీవితంలో ఎంతో మంది అప్సరసల్ని చూసాడు. కానీ ఈమె అందం ముందు వారంతా దిగదుడుపే! చిత్ర పటమే ఇంత మనోహరంగా ఉంటే అసలు రూపం ఎంత అద్భుతంగా ఉంటుందో? ఒక్క క్షణం నోట మాట రాలేదు మహారాజుకి.

శంభుడూ, వేదరాయశర్మా మహారాజు ముఖకవళికలనే గమనిస్తూ ఉండిపోయారు. దేవరాయలు తన మనసుకనిపించిన వన్నీ పైకి అనేసాడు.

"మహారాజా! మీకు ఎప్పుడో సెలవిచ్చాను. నేహల వంటి సౌందర్యవతి ఈ విజయనగర రాజ్యంలోనే లేదని. మీరు నన్ను అప్పుడు విశ్వసించలేదు. చిత్ర పటంలో ఎలా వుందో దానికి పది రెట్లు అందంగా ఉంటుంది ఆమె అసలు రూపం. అందాల అపరంజి బొమ్మ. ఒక్క మాటలో చెప్పాలంటే తన శక్తినంతా ధారపోసి బ్రహ్మదేవుడు మలిచిన మానవ శిల్పం ఆమె. అందమే కాదు. ఆమె నాట్యం మీరు చూసే తీరాలి..."

దేవరాయలు మంత్ర ముగ్ధుడై చిత్ర పటంకేసే చూస్తూ వేదరాయశర్మ మాటల్ని వింటున్నాడు.

"అద్భుత సౌందర్య రాశి. ఇంతకీ ఆమె పేరేమిటన్నారు?" చిత్ర పటం నుండి అతని ధ్యాస పక్కకి మరల్లేదు.

"నేహల.."

"ఓ! నేహలా! పేరు కూడా ఆమె కంటే అందంగా ఉందే! ఈమెని తక్షణం చూడాల్సిందే! వేదరాయశర్మగారూ అమ్మాయిని విజయనగరం తీసుకొచ్చే బాధ్యత మీది. అందాల సౌదర్య రాశిని చూడాలని మా మనసు ఉవ్విళ్ళూరుతోంది. కన్ను చెదరే అందం. చిత్రపటమే చూస్తేనే మా మనసిలా అయ్యిందంటే, మీరు చెబుతున్నా మాటలు వింటూంటే ఆమెను చూస్తే ఎలా వుంటుందో? తక్షణమే మీరు ముద్గల్ వెళ్ళి ఆమెను తీసుకు రండి. లేదా మీ శిషుడి ద్వారా కబురు పంపండి."

మహారాజు మాటలు విని ఎంతో పొంగిపోయాడు వేదరాయశర్మ. మహారాజు ముందు ఎప్పటికైనా నేహల నాట్య ప్రదర్శన ఏర్పాటు చేయించాలన్న కోరిక ఇన్నాళ్ళకి తీరుతోంది. దసరా ఉత్సవాలకి రమ్మనమని ఎంత బ్రతిమాలినా రాలేదు. ఇప్పుడు తప్పకుండా వస్తుందన్న నమ్మకం వచ్చింది.

"మహారాజా! నేను వెళ్ళి మరలా వెనక్కి విజయనగరం రాలేను. వయోభారం పెరిగింది. ఎక్కువసేపు ప్రయాణించలేకుండా ఉన్నాను. నా మాటగా చెప్పానని మీరు మీ దూతల్నిచ్చి ముద్గల్ పంపండి. నేహల తప్పకుండా వస్తుంది.."

వేదరాయశర్మ మాటలువిని సందిగ్ధంలో పడిపోయాడు దేవరాయలు. వేదరాయశర్మ చెప్పిందీ నిజమే! పెద్దాయన మాట కాదన లేకపోయాడు.

"అయితే మీ శిష్యుణ్ణిచ్చి పంపండి.." అంటూ శంభుడి కేసి చూసాడు.

శంభుడికిది విన్నాక మచ్చెమటలు పోసాయి. అసలే తను భయం భయంగా చిత్రం పటం వేసాడు. ఇప్పుడు ఏకంగా నేహల్నే తీసుకు రమ్మనమని ఆదేశిస్తే ఆమె చేతిలో తన చావు మూడినట్లే!

"మహారాజా! నాదొక చిన్న విన్నపం. నేహలకెంత అందముందో అంతే పట్టుదల కూడా ఉంది. మేమెవరు వెళ్ళినా ఆమె రాదు. మీరే వేరెవరినయినా అధికారుల్ని పంపిస్తే వచ్చే అవకాశం ఎక్కువ. మమ్మల్ని చూస్తే అస్సలు రాదని నా విశ్వాసం."

వేదరాయశర్మకి శంభుడి మాటల్లో నిజం కనిపించింది. అతనికి మద్దత్తుగా అదే మరలా చెప్పాడు.

దేవరాయలు ఆలోచించాడు. అతనికి నేహల అందం పదే పదే గుర్తుకొస్తోంది. మోహం కోరికా, అనురాగమూ క్షణ క్షణానికి పెరిగిపోతున్నాయి. ఎలాగయినా ఆమెను వివాహమాడాలన్న కోరిక తీవ్రంగా పెరిగిపోతోంది. గజపతి రాజుల ఉమాదేవిని

వివాహమాడడానికి రాజకీయావసరం తప్ప మరేమీ లేదు. ఉమాదేవిది ఓ మోస్తరు అందం. తన రాణులందరూ నేహాల ముందు సూర్యుడు ఎదుట దివిటీల్లాంటి వాళ్ళు.

"అయితే ఓ పని చేస్తాను. రాజాహ్వానం ఇచ్చి మా అస్థాన పండితుణ్ణీ, సైనికాధికారినీ ఇచ్చి పంపుతాను. నా మాటగా కుటుంబ యజమానిని విజయనగరానికి ఆహ్వానిస్తాను. ఏమంటారు?"

మాహారాజు సలహా వేదరాయశర్మకి నచ్చింది. హమ్మయ్యా అనుకుంటూ శంభుడు ఊపిరి పీల్చుకున్నాడు.

వేదరాయశర్మ అలాగే కానివ్వండని చెప్పాడు.

ముద్గల్కి పంపడానికి దేవరాయలు భూషణాచార్యుడనే పండితుడికి కబురంపాడు. అతనితో పాటు రెండవ వర్గపు దండనాయకుణ్ణీ పిలిపించాడు.

కొంతసేపయ్యాక భూషణాచార్యుడొచ్చాడు. రాగానే దేవరాయులు విషయం చెప్పి, నేహాల చిత్రపటాన్ని చూపించాడు. భూషణాచార్యుడూ నేహాల అందం చూసి ఆశ్చర్యపోయాడు.

"మీకు కాబోయే పట్ట మహిషా మహారాజా?" అంటూ ప్రశ్నించాడు.

దేవరాయలు అది విని గట్టిగా నవ్వాడు.

"అదే అనుకోండి. ఈమె మన వేదరాయశర్మగారి శిష్యురాలు. ఈమె సౌందర్యం చూసారుకదా? ఈ అమ్మాయి నాట్యం కూడా అద్భుతంగా చేస్తుందట. ఈ నిమిత్తమై ఒక రాచకార్యం మీపైన పెట్టదలుచుకున్నాను. మీరు తక్షణమే ముద్గల్ వెళ్ళి ఆమెను కుటుంబ సమేతంగా ఇక్కడికి తీసుకురావాలి. మీకు తోడుగా మా దండ నాయకుణ్ణీ, కొంత మంది భటుల్నీ పంపుతాను."

"మహారాజా! మీరు చెప్పినట్లుగానే చేస్తాను. ఈ చిత్రపటం చూసాక మీరు ఆమెను వివాహమాడి పట్టమహిషిని చేసుకుంటే బావుంటుదనిపిస్తోంది.. ఎందుకో ఆమెను చూడగానే అలా అనిపించింది."

భూషణాచార్యుడి మాటలు దేవరాయలుకి కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. అవును నిజమే! తను పెళ్ళి చేసుకుంటే కాదనే వారెవరు? ఇంతటి అప్సరసని తనే వివాహమాడితే అడ్డేముంది? మహారాణులు కాదన్నా తన మాటకెవరూ ఎదురు చెప్పరు. ఉమాదేవిని పెళ్ళి చేసుకొని ఏడాది కూడా కాకుండా మరోక వివాహమా అని ప్రజలనుకోవచ్చు. అయినా తను మహారాజు. తన ఇష్టానికి వ్యతిరేకంగా ఎవరూ మనలేరు. ఈ ప్రపంచంలో కోరికకి అధికారం తోడయితే అందనివంటూ ఉంటాయా?

"భూషణాచార్యా! మీరు చెప్పిందీ సబబుగానే ఉంది. పెద్దలు. ఏ దైవం మీ చేతలా పలికించాడో? మీరు చెప్పినట్లుగానే ఆమెను వివాహమాడతానని రాజాహ్వానం పంపండి. వివాహ సందర్భంగా మణులూ, మాణిక్యాలూ, బంగారు భరణాలూ, పట్టు వస్త్రాలూ ఇంకా ఏన్నో కానుకలు తీసుకెళ్ళండి. మా తరపున ప్రత్యేక ఆహ్వానాన్ని తయారుచేయించి పంపుతాను. ఈ పెళ్ళికి మీరే పెద్దలు.." దేవరాయలకి భూషణాచార్యుడి మాటలు నెత్తికెక్కాయి.

దేవరాయల నిర్ణయం వినీ వేదరాయశర్మా, శంభుడూ ఆశ్చర్యపోయారు. ఏదో నేహాల నాట్య ప్రదర్శన జరుపుతరనుకున్నరు కానీ ఇలా మహరాజు ఇంత త్వరితంగా వివాహ నిర్ణయం తీసుకుంటారని ఊహించలేదు.

వేదరాయశర్మకి ఎంతో ఆనందం కలిగింది. తన శిష్యురాలు మహారాణయితే తనకీ, ముద్గల్కీ ఎంతో గౌరవం పెరుగుతుంది. నేహాలకీ సరైన స్థానం లభిస్తోందని ఎంతో సంతోషించాడు.

శంభుడి విషయం వేరేలా వుంది. అతని పరిస్థితీ అలాగే ఉంది కానీ అది ఆనందం కాదు; ప్రతీకారం. తనకు దక్కని నేహాల్ని రేవన్న తనవైపు మళ్ళించుకున్నాడన్న కోపం. ఈ వివాహమే జరిగితే ఒకే దెబ్బకి రెండు పిట్టలు. నేహాల పొగరూ అణుగుతుంది. రేవన్నపై ప్రతీకారమూ తీరుతుంది. ఇది తలచుకొని శంభుడు లోలోపలే నవ్వుకున్నాడు.

"శుభం మహారాజా! కళ్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆగదంటారు, ఇదే కాబోలు. మీరు సెలవిచ్చినట్లుగానే ముద్గల్ వెళ్ళి మీ తరపున ఆహ్వానాన్ని అందిస్తాను. ఈ మాసం మాఘమాసం కూడా. మంచి ముహూర్తాలున్నాయి. మేమొచ్చేలోగా మీరు పెళ్ళి ఏర్పాట్లు కానివ్వండి. ఈ లోగా మన వేదరాయశర్మగారి చేత  ఓ మాంచి పెళ్ళి ముహూర్తం పెట్టిస్తే సరి." భూషణాచార్యుడు సెలవిచ్చాడు.

మాహారాజూ, అంతరంగికులూ, వేదరాయశర్మా, భూషణాచార్యుడూ అందరూ ఈ వివాహానికి ఆమోద ముద్ర వేసారు. అందరూ నవ్వుకుంటూ గట్టిగా సంభాషిస్తున్నారు.

అదే సమయానికే ఒక వ్యక్తి మందిరం లోపలకి అడుగుపెట్టబోతూ ఆ కేరింతలూ, నవ్వులూ విని ఒక్కసారి ఆగిపోయి వారి మాటలు శ్రద్ధగా వింటున్నాడు.  సందర్భం సరిగా అర్థం కాలేదావ్యక్తికి. అక్కడే ఉన్న ఒక భటుణ్ణి అడిగాడు.  భటుడు జరిగినదంతా పూస గుచ్చినట్లు చెప్పాడు.

అది విని ఆ వచ్చిన వ్యక్తి లోపలకి ప్రవేశించకుండా వెనుతిరిగాడు.

అతని వైపే ఆశ్చర్యంగా చూస్తూ ఉండి పోయాడా భటుడు.

ఆ వచ్చిన వ్యక్తి ఎవరో కాదు. మాహారాణి ఉమాదేవి తమ్ముడు.

000000000000 .

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library